# బాబాయి పెంచిన తోట

-ముదిగొండ శివకౌముదీ దేవి

"ఈ పెరట్లో ఆ మామిడి మొక్కా? బ్రతకదేమో బాబాయి. బతికినా ఎక్కువ పెద్దగా పెరగకపోవచ్చు" - అనుమానంగా అన్నాను నేను.

ఆ మొక్క చూస్తే బలహీనంగా ఉన్నది.

ఈ పెరడు చూస్తే అంతా మొరం (రాళ్ళు, ఇసుక కలసిన నేల) మంచి మన్ను లేదు, అందువల్ల నాకు అనుమానంగా అనిపించింది. అప్పుడు నేను పదో తరగతి చదువుతున్నాను. పరీక్షలైపోయాయి. వేసవి సెలవులు. బాబాయి దగ్గర గడుపుదామని వచ్చాను. కాని బాబాయికి విశ్వాసం, ఆత్మవిశ్వాసం రెండూ ఎక్కువే.

"ఎందుకు పెరగదే, తప్పకుండా పెరుగుతుంది చూడు" అన్నాడు బాబాయి ఆనందరావు.

"శారదా, నీకు నమ్మకం తక్కువే-" అన్నాడు పైగా.

"అవును బాబాయి. నీకు విశ్వాసం ఎక్కువ కూడ" అన్నాను నేను ఇంకా అపనమ్మకంగా.

కాని బాబాయి మొండి పట్టుదల గల మనిషి.

ఒక బండెడు మంచి గుల్ల మన్ను తెప్పించి పోయించాడు - పెరడంతా. గోతులు తవ్వి ఆ మన్ను సర్దించాడు. ఆ తర్వాత ఒక గుంటలో ఆ మామిడి మొక్క పాతాడు. ఆ తర్వాత కొబ్బరి, పనస, బొప్పాయి, మందారం, వాకిట్లో పున్నాగ, పొగడ, వీధి గోడ ప్రక్కన పారిజాతం, గన్నేరు, సంపంగి, పెరట్లో జామ, జువ్వి మొగ్గలు, మల్లెతీగ పాతాడు. ఎక్కడి నుంచో సింహాచల సంపెంగ మొక్క కూడ తెచ్చి నాటాడు. అది ఇక్కడ తెలంగాణలో పెరగదేమో - అని నాకు అనుమానం. విశాఖపట్నం జిల్లాలో తప్ప ఆంధ్రాలో కూడ ఇంకెక్కడా ఆ మొక్క నేను చూడలేదు. నైట్‌క్వీన్, జాజితీగ, సన్నజాజి పందిరి వేయించాడు.

నేనన్నాను - "బాబాయి! ఈ మొక్కలన్నీ పెరగ వచ్చును. పెద్దవై పూలు పూసి, కాయలు కాయ వచ్చును. కాని ఆ మామిడి మొక్క మాత్రం పెరగదు. పందెం" అన్నా.

బాబాయి ఆశ్చర్యంగా చూసాడు- "అదేమిటి? ఎందుకు నీకు అంత అపనమ్మకం? పందెం కూడ కాస్తానంటున్నావు? ఏమిటి పందెం?" అన్నాడు.

ఒకవేళ ఈ మామిడిమొక్క బ్రతికి రాబోయే రెండేళ్ళలో పెద్దదవుతే నేను ఇంటర్లో బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకున్నా, నాకు ఇంజనీరింగులో సీటు వచ్చినా, వదిలేసి ఆర్ట్స్ చదువుతాను. సరేనా?" అన్నాను.

బాబాయి ఆశ్చర్యపోయాడు.

"వద్దు శారదా! అంత పెద్ద పందెం కాయకు. జీవితంలో పైకి రావాల్సిన పిల్లవి-" అన్నాడు అనునయంగా.

"కాదు బాబాయి. ఆ మొక్కకి ఆకులే లేవు. అది బ్రతకడం కష్టం" అన్నాను నేను - చిన్న రెండు చిగురు

## దాస్యం నానీలు

ప్రజాహితునికి
పట్టంకట్టు...
ప్రగతికి
శ్రీకారం చుట్టు!
దొంగలు
ఊళ్లు పంచుకున్నట్లు మరి..
చెరి సగకాలం
ఛైర్మన్‌గిరి!
కాణీ ఖర్చులేని
దానం..
మన నేతలు చేసే
వాగ్దానం!
నేతి బీరకాయలో
నెయ్యెంతో..
నేటి నేతల చేతల్లో
నీ తంతే!
ప్రభుత్వ
సహాయ నిధి...
ప్రజా ప్రతినిధులకు
పెన్నిధి!

-దాస్యం సేనాధిపతి

ఆకులు తప్ప మరే పెద్ద ఆకులు లేని మొక్కని చూస్తూ. కొమ్మలు వచ్చి పిందెలు కూడ వేసింది.

"సరే అయితే, చూద్దాం. దేవుడి దయ ఎట్లా ఉందో?" అన్నాడు బాబాయి.

"ఓం నమశ్శివాయ" అంటూ ఆ మొక్కని నేలలో పాతి నీరు పోసాడు– "నారు పోసినవాడే నీరు పోయాలి గదా!" అంటూ.

ఆ మొక్కని చూస్తే నాకెందుకో జాలి వేసింది. బ్రతకాలని దాని మనస్సులో కోరిక ఉన్నట్లు; అది బ్రతకాలని నా మనస్సులో కోరిక ఉన్నట్లు, నాకు తోచింది.

నేను అనాలోచితంగా ఎందుకు పందెం కాశానో కాని, నేను పందెం ఓడిపోయినా సరే, ఆ మామిడి మొక్క బ్రతకాలనే నాకు అనిపించింది. నేను కూడ ఆ మొక్క బ్రతకాలని దేవుడిని ప్రార్థిస్తూ "ఓం నమశ్శివాయ" అంటూ ఆ మొక్కకి ఒక మగ్గునిండా నీరు తెచ్చిపోశాను.

కళ్ళు మూసుకుని ఒక్క క్షణం ఆ మొక్క బ్రతకాలి – అని భగవంతుడిని ప్రార్థించాను. ఆ తర్వాత దానిని చేత్తో దీవించాను. ఎందుకంటే ఆ మొక్కలో ఉన్న జీవకాంక్ష నా కంటికి కనిపించింది.

❖ ❖ ❖

కొద్ది రోజులు గడిచాయి.

నేను ఇంటర్మీడియట్‌లో చేరే హడావిడిలో మొక్క సంగతి మర్చిపోయాను.

ఆ తర్వాత నెల రోజులకి జ్ఞాపకం వచ్చి పెరట్లోకి వెళ్ళి చూసాను. మామిడి మొక్క బ్రతికింది!!!

కొద్ది రోజుల్లో అది పెద్దదైంది.

ఆర్నెల్లు గడిచేసరికి అది పెద్దదై నాలుగు అడుగుల ఎత్తు కూడ పెరిగింది. దాని కొమ్మలతో అంటు కట్టి వేరే మొక్కలు కూడ తయారు చేసారు బాబాయి.

నేను పందెం కట్టినందుకేమో, బాబాయి ఆ మొక్క మీద పెద్దగా శ్రద్ధ వహించలేదు. ఏదో మామూలుగా అన్ని మొక్కలకీ పోసినప్పుడు కొన్ని నీళ్ళు పోసేవాడు.

అంతే.

కాని ఆ మొక్కకి జీవం ఉన్నది. దానికి బ్రతకాల్సిన భవిష్యత్తు ఉన్నది. అది బ్రతికింది.

నేను ఆ మొక్క బ్రతకదు, బ్రతికినా పెరిగినా పెరిగి పెద్దది కాదు – అని పందెం కట్టాను.

కాని అది బ్రతికింది. నా ఇంటర్మీడియట్ పరీక్షలు అయి నాకు ఇంజనీరింగులో సీటు వచ్చినట్లు తెలిసే నాటికి అది బ్రతకడమే గాక పెద్దదై బాగా దృఢమైన కొమ్మలు వచ్చి పిందెలు కూడ వేసింది.

నేను పందెం ఓడిపోయాను.

ఒప్పుకున్నాను.

బాబాయితో చెప్పాను – ఇంజనీరింగు మానేసి బిఏలో చేరుతానని.

బాబాయి కోప్పడ్డాడు. "సరదాగా కాసిన పందెం గురించి అంత సీరియస్‌గా తీసుకోవద్దు" అన్నాడు.

కాని నేను ఒప్పుకోలేదు.

మాట అంటే మాటే. నిలబెట్టుకోవాలి.

పందెం అంటే పందెమే – గెలిచినా, ఓడినా.

సరే!

నేను బిఏలో చేరాను.

నేను బిఏ పాసయ్యే నాటికి మామిడిచెట్టు బాగా విస్తరించింది. దాని కొమ్మలకి చిన్న ఉయ్యాల వేసి

## నానీలు

**అంతా**
వెలుతూనే ఉన్నారు.
నన్నే.. ఒక్కసారిగా
ఎవరో ఆపేసారు.

మెదడునిండా
ఎగసిపడుతున్న వర్షం
తడుస్తున్నా
కాలుతూనే ఉన్నాను.

అంతా
మునిగిపోయింది.
వర్షం
కొంచెం సహనం చూపాల్సింది.

తెల్లటి గోడపై
ఎవడో ఉమ్మేసాడు.
మరక
ఎంత భయంకరమైంది.

పొడి ఆలోచన
కవిత్వం అవుతుందా?
తన్మయంగా
తడిసిపోవాలి గాని!

–ఎం. నారాయణశర్మ

పిల్లలు ఉయ్యాల ఊగేటంత అయింది. ఆ తర్వాత నేను ఎంఏ తెలుగు సాహిత్యం చదివేను. ఆ తర్వాత ఒక తెలుగు దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా చేరాను. ఈ లోగా బాబాయి పెంచిన తోట బాగా అభివృద్ధి చెందింది. ఈ ఏడు సంవత్సరాల కాలంలో బాబాయి నాటిన కొబ్బరి, పనస, బొప్పాయి చెట్లు కాయలు కాస్తున్నాయి. అరటి చెట్లు గెలలు వేసాయి. మందారం, సంపెంగ, పారిజాతం, జువ్వి మొగ్గలు, మల్లెపూలు పూస్తున్నాయి.

వాకిట్లో పున్నాగ చెట్టు, పొగడ చెట్టు పెద్ద వృక్షాలయినవి. ప్రతి ఆకు మాటునా మొగ్గ తొడిగి పున్నాగ చెట్టు ఒక వెన్నెల వృక్షం వలే ఉన్నది. పొగడపూలతో పొగడచెట్టు ఎత్తయిన వెండి దీపపు సెమ్మెవలె ఉన్నది.

పెరడంతా పచ్చదనం, చల్లదనంతో నిండిపోయింది. మామిడిచెట్టుకి ఉయ్యాల వేసి బాబాయి పిల్లలు ఊగుతున్నారు.

మామిడి కాయలతో ఇంట్లో పచ్చడి పెడుతున్నారు. పెరడంతా మల్లెపూల సౌరభం.

జువ్వి మొగ్గల (విరజాజుల) సువాసనలతో గాలి సురభిళమై వీస్తోంది. బాబాయి ఏడు సంవత్సరాల కృషి సఫలమైంది. ఆనాడు ఆ పెరట్లో మొరమ్ నేలలో మొక్కలు పెరగవు - అనుకున్నాను. అవిశ్వాసం ప్రకటించాను.

కాని బాబాయి విశ్వాసం అఖండం, అనితర సాధ్యం. అందులోనే క్రొత్త మన్ను కొద్దిగా వేయించి ఆ నేలలోనే అన్ని మొక్కలు నాటి, వాటికి ఎరువులు శ్రద్ధగా వేసి, నీరుపోసి పెంచాడు. ఒక సుగంధ వనం, ఒక హరితవనం, ఒక ఫలపుష్ప ఉద్యానవనం వికాసం పొందేటట్లు కృషి చేసాడు.

## దగాకోరు

దగాకోరులు దూరంగా వుండరు,
దగ్గర్లోనే పొంచి వుంటూ,
ప్రేమ గాలాల్ని వేస్తూ,
కాస్మోటిక్స్ మాయాజాలాల్తో,
కన్నె వయసులను,
కాలనాగుల్లా,
కాటేస్తారు
తస్మాత్ జాగ్రత్త...

-ఈవేమన

ఆయన కృషి, విశ్వాసం రెండూ గొప్పవే.

నేను నా అవిశ్వాసం సడలించుకున్నాను.

"కృషితో నాస్తి దుర్భిక్షం" అంటే ఇదే కదా!

ఆ పెరడు చూసినప్పుడల్లా నాకు ఆనందంగా ఉంటుంది. ఆ మామిడి మొక్క ఏదో పూర్వజన్మ స్మృతి వలే తోచేది, సైన్సు విద్యార్థిగా నా జీవితం గుర్తు చేస్తూ.

అప్పుడు మాత్రం కొంచెం - స్వల్పంగా - విచారంగా ఉంటుంది.

ఆనందంతో విచారం కలిసిపోవడం యాదృచ్ఛికం.

నేను పత్రికా రంగంలో సంతోషంగానే ఉన్నాను.

తెలుగు సాహిత్యం చదివినందుకు సంతోషమే. కాని అయినా ఏదో తెలియని విచారం. బహుశా అది నేను పోగొట్టుకున్న విజ్ఞాన శాస్త్రం మీద, గణిత శాస్త్రం మీద మమకారం వల్ల, తెంచుకోలేని అనుబంధం వల్ల కావచ్చు.

ఒంటరి చీకటి రాత్రుళ్ళు ఆరుబయట ఏ నవారు మంచం పైనో పడుకొని నక్షత్రాలు లెక్కిస్తుంటే, గాలి లోంచి దూరం నుండి తేలివచ్చే ఏదో పాట మనస్సు తెరలు తొలగించి, అట్టడుగున భద్రంగా దాచుకున్న విషాద స్మృతిని కదిలించినట్లు ఏదో విచారం, అర్థం కాని దిగులు - మనసులో వంతెన క్రింద నీరు వలె నిశ్శబ్దంగా ఉన్నాయి.

అందువల్ల ఆ మామిడిచెట్టు నాకొక ఆనంద విషాద స్మృతి. గత జీవిత స్మృతి. బాల్య జ్ఞాపకం.

నా చిన్ననాటి తొందరపాటు తనానికి, తరచూ పందేలు కట్టే నా చెడు అలవాటుకు కూడ అది గుర్తుగా మిగిలింది. అందుకే ఆ చెట్టు దగ్గరకు వెళ్తే నేను ఆనంద విషాదాల మధ్య ఊగిసలాడుతూ ఒక విచిత్ర మానసిక స్థితిలో మిగులుతాను.

అయినా ఒక చెట్టు బ్రతకాలని నేను కోరుకున్నాను. నా కెరీర్ మారిపోతుంది. నాకిష్టమైన సబ్జెక్టు, కెరీర్ పోగొట్టుకుంటానని తెలిసినా ఆ చెట్టు బ్రతకాలని నేను అభిలషించాను, పచ్చదనంపై నాకంత ప్రేమ ఉంది. జీవంపై నాకంత ఉత్సాహం ఉన్నది అని నాకు గర్వమే.

ఎవ్వరైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా జీవించాలనే కదా కోరుకోవాలి? మృతిని కోరకూడదు. అవునా?

అది నా జీవ కాంక్షకే కాకుండా బాల్య లక్షణానికి కూడ గుర్తుగా మిగిలింది. ■